సాక్షి
మహబూబ్‌నగర్
శనివారం । 18 । మే । 2024



కబడ్డీ.. కబడ్డీ

జిల్లా కబడ్డీ అసోసియేషన్ క్రీడాకారులకు వెన్నుదన్నుగా ఉంటూ ప్రోత్సహిస్తోంది.

వివరాలు 8లో ▸



మూడంచెల భద్రత

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెప్పారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.9 /22.2

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

పండ్ల గోదాముల తనిఖీ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని పండ్లను నిల్వ చేసే వివిధ గోదాములను శుక్రవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్ తనిఖీ చేశారు. కాగా, ఈనెల 16న సీఆర్‌టీ సభ్యులు పట్టణంలోని పండ్ల గోదాములను పరిశీలించి కృత్రిమ పద్ధతిలో మాగబెట్టొద్దని, అధిక మోతాదులో ఎథిలిన్ కెమికల్ పాకెట్లు వాడొద్దని వ్యాపారులకు సూచించారు. అనంతరం ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఆయన ఆదేశాల మేరకు తాజాగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ వజ్రకుమార్‌రెడ్డిలతో కలిసి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఈ తనిఖీలు చేపట్టారు. తెలంగాణ చౌరస్తాలోని ఆర్‌హెచ్ ఫ్రూట్స్, సుభాష్‌నగర్‌లోని వీహెచ్ ఫ్రూట్స్, వీరన్నపేట రోడ్‌లోని ఎస్‌బీ ఫ్రూట్స్, వీరన్నపేట ప్రాంతంలోని వీఎఫ్‌సీ ఫ్రూట్స్ గోదాము లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్నిచోట్ల అనుమతి పొందిన రసాయన స్ప్రేలు, ప్యాకెట్లే వినియోగిస్తున్నారని నిర్ధారించారు. ఎక్కడా కార్బైడ్ పౌడర్ వాడ లేదని వారు తేల్చారు. కేవలం మదీనా మసీదు సమీపంలోని ఓ దుకాణంలో 7–8 కిలోల మురిగిపోయిన మామిడిపండ్లను స్వాధీనం చేసుకుని డంపింగ్‌యార్డుకు తరలించారు.


సోనామసూరి రూ.2,259

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్‌లో శుక్రవారం జరిగిన టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు సరాసరిగా గరిష్టంగా రూ.2,259గా ఒకే ధర లభించింది. ధాన్యం సీజన్ ముగుస్తుండడంతో మార్కెట్‌కు కేవలం రెండు వందల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

ఆత్మ ఘోష..!

మూలనపడిన వ్యవసాయ సాంకేతిక పథకం

- ఐదేళ్లుగా నిధులు రాక నీరసం
- రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలకు బ్రేక్
- ఇతర విధుల్లోకి ఆత్మ సిబ్బంది
- నీరుగారుతున్న పథకం లక్ష్యం



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) నిధులు లేక నీరసించిపోతోంది. ఎలాంటి కార్యక్రమాలు లేక నామమాత్రంగా మారడం.. పట్టించుకునే వారు లేక ఘోషిస్తుంది. ఆత్మ ఆధ్వర్యంలో రైతులను చైతన్యవంతం చేసేందుకు సదస్సులు, ప్రదర్శనలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా, ఆ దిశగా ఎలాంటి కృషి జరగడం లేదు. యంత్రాలు కొనుగోలు చేసినప్పటికీ వాటిపై అవగాహన కల్పించవారే లేరు. వరి, పత్తి, కందులు, పెసర, శనగ తదితర పంటలతో పాటు మామిడి, జామ తోట లను పెంచుతున్న వారికి సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఆత్మ సంస్థను ఏర్పాటు చేశారు. కానీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆత్మ ఏర్పాటు లక్ష్యం నీరిగారిపోతుంది.

శిక్షణే లక్ష్యం...

వ్యవసాయశాఖలో 'ఆత్మ' అంతర్భాగం. వ్యవసాయశాఖ సిబ్బంది పంటల సాగు, విస్తీర్ణం, సస్య రక్షణ చర్యలు, పంటల సర్వే, పంట మార్పిడిపై అవగాహన కల్పించడం తదితర కార్యక్రమాలను పర్యవేక్షిస్తే.. వ్యవసాయరంగంలో చోటు చేసుకుంటున్న ఆధునిక మార్పులను రైతులకు ఎప్పటికప్పుడు తెలియచెప్పడం ఆత్మ పని. 2006లో ప్రారంభమైన ఈ పథకం కింద కలెక్టర్ చైర్మన్‌గా, వ్యవసాయశాఖ అధికారి కన్వీనర్‌గా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. డివిజన్‌స్థాయిలో ఈ కమిటీలు ఉండేవి. అధికారులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి రైతులకు సాగుపై అవగాహన కల్పించేవారు. పశుసంవర్ధకశాఖ, ఉద్యాన, మత్స్యశాఖల్లో సాంకేతికంగా వచ్చే అనేక మార్పులకు సంబంధించిన అంశాలు అధికారులు వివరించేవారు. ప్రస్తుతం ఇవేం జరగడం లేదు. ఇప్పుడు కమిటీలు కూడా ఏమీ లేవు. దీనికి ఇది వరకు చైర్మన్ కూడా ఉండేవారు. ఇప్పుడు ఎవరూ లేరు. దీంతో ఈ పథకం ఉందన్న విషయం చాలా మంది రైతులకు తెలియని పరిస్థితి. కార్యాలయం ఎక్కడ ఉంది, దానిలో ఎంతమంది పని చేస్తారు, వారి ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం కలుగుతుంది అనే అంశాలపై చాలా మంది రైతులకు ఇప్పటి వరకు అవగాహన లేదు. ఐదేళ్ల క్రితం వరకు చురుకుగా పనిచేసిన ఆత్మ.. ఆ తర్వాత కార్యక్రమాలు అటకెక్కాయి. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలోనే ఒక పక్కన ఆత్మ కార్యాలయం ఉంది.

ఊసేలేని కార్యక్రమాలు

వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంవర్థక, పట్టు పరిశ్రమలు, మార్కెటింగ్ శాఖల భాగస్వామ్యంతో రైతులకు శిక్షణ, అంతర్ జిల్లా, అంతర్రాష్ట్రాలకు విజ్ఞానయాత్రలు నిర్వహించాలి. వ్యవసాయ ప్రదర్శనలు, సాగు విస్తరణ కార్యక్రమాలు, పొలం బడులు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థ నిర్వహించే వ్యవసాయ, అనుబంధ రంగాల కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి. వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ విశ్వవిద్యాలయాల సహకారంతో ఆధునిక సాంకేతికతను రైతులకు అందించాలి. అవసరానికి అనుగుణంగా కొత్త విధానాలను విస్తరించడం, క్షేత్ర దినోత్సవాలను, కిసాన్ గోష్ఠి, రైతు–శాస్త్రవేత్తల గోష్ఠి లాంటి కార్యక్రమాలను నిర్వహించాలి. కానీ ఇవేమీ జరగడం లేదు. జిల్లాలో 3.21 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న పంటలతో పాటు పండ్ల తోటలు, కూరగాయల తోటలు సాగవుతున్నాయి. ప్రధానంగా వరి, పత్తి పంటలు పండుతున్నాయి. ఈ పంటల సాగులో ఇటీవల అనేక మెరుగైన పద్ధతులు వచ్చినా వాటి గురించి తెలియక రైతులు పాత పద్ధతులనే అనుసరిస్తున్నారు.

నిధులు రావట్లేదు..

వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో గతంలో పంటల సాగుపై రైతులకు విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేది. ఐదేళ్ల నుంచి ప్రభుత్వం నిధులు మంజూరు చేయట్లేదు. దాంతో రైతులకు ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం లేదు. సంస్థ పరిధిలో ఉన్న ఏటీఎంలు, బీటీఎంలు ఖాళీగా ఉండకుండా డీఏఓ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి కూడా మూడు నెలల కోసారి ప్రభుత్వం జీతాలు చెల్లిస్తుంది.

– మాధవి,
ఇన్‌చార్జి ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్

సిబ్బంది ఉన్నా.. పని లేక...

ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ)గా హూక్యానాయక్ కొనసాగుతున్నా.. ప్రస్తుతం ఆయన కూడా మెడికల్ లీవ్‌లో వెళ్లిపోయారు. డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా (డీపీడీ)తో పాటు నలుగురు అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజర్లు (ఏటీఎం), ఇద్దరు బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ (బీటీఎం) ఆత్మ సంస్థలో ఉన్నారు. ఏటీఎం, బీటీఎంలు కాంట్రాక్టు ఉద్యోగులు. వీరు వ్యవసాయం చోటు చేసుకున్న ఆధునిక పద్ధతుల పట్ల రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాల్సి ఉంటుంది. కానీ ఐదేళ్ల నుంచి జిల్లాలో రైతుల కోసం ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించడం లేదు. టూర్ ప్రోగ్రాంలు లేవు. క్షేత్ర సందర్శనలు అసలే లేవు. పొలం బాటలు ఏమాత్రం కానరావడం లేదు. శాస్త్రవేత్తలతో రైతులకు ఇష్టాగోష్ఠి ఊసే లేదు.

▪ ఐదేళ్లుగా ఆత్మ పథకం కోసం ఒక్క పైసా ఇవ్వలేదు. గతంలో ఏటా రూ.5లక్షల వరకు నిధులు ఇచ్చేది. ఇతరాత్ర వ్యవసాయ కార్యక్రమాలకు కూడా ప్రభుత్వం నుంచి నిధులు ఉండేవి. 2020 నుంచి నిధులు ఇవ్వడం నిలిపివేసింది. దీంతో నిధులు లేక ఆత్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం ఆగిపోయింది.

పనులు వేగంగా చేయిస్తున్నాం: కలెక్టర్



మిడ్జిల్ మండలం రాణిపేటలో తడిసిన వడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని కలెక్టర్ జి.రవికుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బదులిస్తూ ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, తాగునీరు, తరగతి గదుల మరమ్మతు పనులు వేగంగా చేయిస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి సకాలంలో రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు. సీఎంఆర్ బియ్యం త్వరితగతిన పంపిణీ చేస్తామన్నారు. వీసీలో కలెక్టరేట్ నుంచి స్థానిక సంస్థల, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు వేగిరం చేయాలి

జడ్చర్ల టౌన్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేసి జూన్ 12 నాటికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని గంగాపురం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల కల్పన, మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా హౌజింగ్ ఏఈ కుమార్‌ను అడిగి పనుల వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి మండలంలోని అన్ని అమ్మ ఆదర్శ పాఠశాలల్లోనూ పనులు పూర్తిచేయించాలని చెప్పా రు. అలాగే పాఠశాలలో కొనసాగుతున్న ఎలక్ట్రిఫికేషన్, టాయిలెట్ పనుల గురించి ఆరాతీశారు. ఆయన వెంట డీఈఓ రవీందర్, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ కన్వీనర్లు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని త్వరగా తరలించాలి

మిడ్జిల్: అకాల వర్షం వల్ల తడిసిన వడ్లను త్వరగా నింపి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సింగిల్‌విండో అధికారులను కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. శుక్రవారం మిడ్జిల్ మండల పరిధిలోని రాణిపేటలో ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన వరి ధాన్యంను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని, ధాన్యాన్ని వెంటనే తరలించాలని సూచించారు. అనంతరం వస్పులలో పాఠశాలలను సందర్శించి.. అక్కడ జరుగుతున్న నిర్మాణాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డీఈఓ రవీందర్, తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ గీతాంజలి, తదితరులున్నారు.

21 నుంచి సదరం క్యాంపులు : డీఆర్‌డీఓ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వికలత్వ పరీక్షల కోసం ఈ నెల 21 నుంచి 29 వరకు సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ నర్సింహులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మీ సేవలో స్లాట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. అందులో వచ్చే తేదీ ఆధారంగా జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే సదరం శిబిరానికి హాజరుకావాల్సి ఉంటుందని ఆయన సూచించారు.

ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో 22న జాబ్‌మేళా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో కరూర్ వైశ్యబ్యాంక్ సహకారంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పకడ్బందీగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈనెల 24 నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ కేవీవీ రవికుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 6,585 మంది, రెండో సంవత్సరం 3,719 మంది మొత్తం 10,304 మంది హాజరు కానున్నట్టు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే రెండో సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందుగానే ఆయా కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలన్నారు. ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించబోమన్నారు. గ్రామాల నుంచి సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి వీలుగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఉదయం ఏడు గంటలకే అందుబాటులో ఉంచాలన్నారు. 144 సెక్షన్ అమలు చేయాలని, సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఐఈఓ శ్రీధర్ సుమన్, డీఈసీ సభ్యులు ఉమామహేశ్వర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌ఓ రవికుమార్

ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ సీట్లు గెలుస్తాం

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- వివరాలు 10లో..

ఆర్టీసీకి కలిసొచ్చిన ఓట్ల పండుగ

- ఎన్నికల వేళ ప్రతిరోజూ రూ.2 కోట్లపైగా ఆదాయం
- తిరుగు ప్రయాణంలో మరింత పెరిగిన రాబడి
- సిబ్బందికి అభినందనలు తెలిపిన ఆర్‌ఎం



స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల సమయంలో ఆర్టీసీకి మెరుగైన ఆదాయం వచ్చింది. ఎన్నికలకు ముందు, తర్వాత ప్రజలు ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడంతో సంస్థకు భారీ ఆదాయం సమకూరింది. చాలామంది ప్రజలు ఓట్లు వేయడానికి తమ స్వస్థలాలకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడంతో బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి.

సిబ్బందికి స్వీట్లు పంపిణీ

లక్షే లక్ష్యంలో భాగంగా ఆర్టీసీ రీజియన్ అధిక ఆదాయం సాధించడంతో శుక్రవారం రీజియన్‌లోని డిపోల ఉద్యోగులు, సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపోలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌ఎం శ్రీదేవి పాల్గొని ఉద్యోగులకు స్వీట్లు అందజేసి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లక్షే లక్ష్యంలో ఈ నెల 14న అధిక ఆదాయం రావడంతో మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశామన్నారు. కార్మికుల కృషి ఫలితమే రీజియన్ మంచి ఆదాయం సాధించిందని, భవిష్యత్‌లో మరింత స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు లక్ష్మీదుర్గ, శ్యామల, డిపో మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

డిపోల వారీగా వచ్చిన ఆదాయం ఇలా.. (రూ.లలో)

డిపో	ఆదాయం
మహబూబ్‌నగర్	2,05,17,341
వనపర్తి	1,75,92,078
గద్వాల	1,48,22,933
కల్వకుర్తి	1,43,12,034
నారాయణపేట	1,32,16,980
నాగర్‌కర్నూల్	1,31,58,317
అచ్చంపేట	1,29,87,379
షాద్‌నగర్	1,22,27,375
కొల్లాపూర్	1,05,87,464
కోస్గి	17,63,092



మహబూబ్‌నగర్‌లో డిపోలో ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి

రోజు రూ.2 కోట్లకు పైగానే..

ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కనిపించింది. ఈ నెల 12 మినహాయించి మిగతా రోజుల్లో మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ నిత్యం రూ.2 కోట్లపైగా ఆదాయం వచ్చింది. ఆర్టీసీ రీజియన్ అధికారులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవడంతో బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా అన్ని డిపోల నుంచి హైదరాబాద్ రూట్‌లో అధిక ఆదాయం సమకూరింది. ఈ మార్గంలోని బస్సులు ప్రయాణికులతో కనిపించాయి. మహాలక్ష్మి పథకం ప్రయాణికులతోపాటు ఇతరులు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేశారు. ఈ రోజుల్లో ఆర్టీసీ రీజియన్ మెరుగైన ఆక్యుపెన్సీ రేషియోను పొందింది. ఈ ఐదు రోజుల్లో రీజియన్‌లోని పది డిపోలు 100కుపైగా ఓఆర్‌ను సాధించింది.



క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.60 వేల నగదు, 10 తులాల బంగారం, 25 తులాల వెండి అపహరణ



ఆత్మకూర్: తాళం వేసిన ఇంటికి కన్నం వేసి బంగారం, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన శుక్రవారం ఆత్మకూర్ మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని దేవరపల్లికి చెందిన వెంకటన్న కుటుంబ సభ్యులతో కలిసి గురువారం కర్నూలోని బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం సాయంత్రం ఇంటికి చేరుకోగా.. తాళం లేకుండా గొల్లెం పెట్టి ఉండటంతో అనుమానం వచ్చి ఇంట్లోకెళ్లి చూశారు. బీరువా తెరుచుకుని ఉండి.. దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయన్నారు. బీరువాలోని రూ.60 వేల నగదు, 10 తులాల బంగారు నగలు, 25 తులాల వెండి నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. క్లూస్‌టీం ద్వారా వేలిముద్రలు సేకరించామని, సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరేందర్ వివరించారు.

కల్వకుర్తిలో..



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాలిలా.. రాఘవేంద్ర కాలనీలో నివాసముండే బాలగౌడ్ తన కుటుంబసభ్యులతో కలిసి గురువారం మంత్రాలయం వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం చేరుకోగానే ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో వెళ్లి చూడగా చోరీ జరిగిందని గుర్తించారు. బాధితుడు వెంటనే డయల్ 100కు ఫోన్‌చేయగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీం నమూనాలు సేకరించారు. దొంగలు ఇంట్లోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడేసి, ఇంట్లోని రూ.80వేల నగదు, 2.5 తులాల బంగారం, ట్యాబ్ ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ఘటనపై ఫిర్యాదు అందిన వెంటనే కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

పరీక్ష రాసేందుకు వెళితే.. మొబైల్స్ అపహరణ

గద్వాల క్రైం: బైక్‌లో దాచిన 8 మొబైల్స్ అపహరణకు గురైన ఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. కొత్తపల్లికి చెందిన శివకుమార్‌రెడ్డి డిగ్రీ పరీక్షలు రాసేందుకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బైక్‌పై వచ్చాడు. పరీక్ష హాల్‌కు మొబైల్స్ అనుమతి లేకపోవడంతో బైక్ డిక్కీలో తన స్నేహితుల మొబైల్ సైతం భద్రపరిచారు. సాయంత్రం పరీక్ష రాసి బయటకు వచ్చి చూడగా గుర్తు తెలియని దుండగులు బైక్ డిక్కీని ధ్వంసం చేసి 8 మొబైల్స్‌ను ఎత్తుకెళ్లారు. దీనిపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆటో కిస్తీలు చెల్లించలేక.. యువకుడి బలవన్మరణ



శివ (ఫైల్)

బిజినేపల్లి: ఉపాధి కోసం ఫైనాన్స్‌లో తెచ్చుకున్న ఆటోకు నెలవారి కిస్తీలు చెల్లించలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాయిన్‌పల్లి గ్రామానికి చెందిన శివ (19) ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఆటో తెచ్చుకుని శాయిన్‌పల్లి నుంచి బిజినేపల్లికి ప్రయాణికులను తరలిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో.. గ్రామం నుంచి వచ్చే మహిళా ప్రయాణికులు ఆటో ఎక్కడం పూర్తిగా మానేశారు. దీంతో ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. నాలుగు నెలలుగా ఆటో కిస్తీలు చెల్లించడం కష్టతరంగా మారింది. ఈ నెల 14వ తేదీన ఫైనాన్స్ సిబ్బంది ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కిస్తీలు చెల్లించేందుకు అప్పు అడిగినా దొరకకపోవడంతో.. మనస్తాపం చెందాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా.. శివ ఉరేసుకుని కన్పించడంతో బోరున విలపించారు. ఉచిత బస్సు ప్రయాణం వల్లే శివ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని గ్రామస్తులు వాపోయారు.

కబడ్డీ.. కబడ్డీ



మ్యాట్‌పై ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

ఉత్సాహంగా కొనసాగుతున్న వేసవి శిబిరం

- పాలమూరులో మొదటిసారి మ్యాట్‌పై..
- 45 మందికిపైగా క్రీడాకారులు
- ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలోని కబడ్డీ క్రీడాకారుల్లో ప్రతిభకు కొదవలేదు. కొన్నేళ్లుగా జిల్లా జట్లు మెరుగైన ఆటతీరుతో రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలుస్తోంది. అలాగే జిల్లా కబడ్డీ అసోసియేషన్ క్రీడాకారులకు వెన్నుదన్నుగా ఉంటూ అన్నివిధాలుగా ప్రోత్సహిస్తోంది.

జిల్లా యువజన, క్రీడలశాఖ సహకారంతో..

ఈ ఏడాది జిల్లాకేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జిల్లా యవజన, క్రీడలశాఖ సహకారంతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. జాతీయ, అంతర్జాతీయ కబడ్డీ పోటీలు మ్యాట్‌పై నిర్వహిస్తారు. దీనిని దృష్టిలో ఉంచుకొని స్టేడియంలో మొదటిసారి మ్యాట్‌పై 45 నుంచి 50 మంది క్రీడాకారులకు శిక్షణనిస్తున్నారు. ఉదయం 6 నుంచి 8.30 వరకు, సాయంత్రం 4.30 నుంచి 7 వరకు శిక్షణ ఇస్తుండగా.. నెలాఖరు వరకు శిబిరం కొనసాగనుంది. కురుమూర్తిగౌడ్, రాజవర్ధన్‌రెడ్డి, పాపారాయుడు, ఆర్.శ్రీనివాసులు శిక్షణనిస్తున్నారు. క్రీడాకారులకు భోజన వసతి అసోసియేషన్ కల్పిస్తోంది.

మ్యాట్‌పై శిక్షణ బాగుంది..



వేసవి శిబిరంలో మ్యాట్‌పై శిక్షణ ఇస్తుండడం చాలా బాగుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నా. నా ఆటలో తప్పులను సరిదిద్దుకుంటున్నా. భవిష్యత్‌లో పీకేఎల్ కబడ్డీ లీగ్‌లో ఆడటమే ధ్యేయం.

– నరేష్‌గౌడ్, మద్దూర్ (చిన్నచింతకుంట)

అందరి సహకారంతోనే..



జిల్లా కబడ్డీ అసోసియేషన్, సీనియర్ క్రీడాకారుల సహకారంతో వేసవి శిబిరం నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది ప్రత్యేకంగా మ్యాట్‌పై క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నాం. శిబిరం నిర్వహణకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

– కురుమూర్తిగౌడ్, క్యాంప్ కోచ్, ప్రధాన కార్యదర్శి, జిల్లా కబడ్డీ సంఘం, మహబూబ్‌నగర్

సీనియర్ నేషనల్ ఆడాలని ఉంది..



గతేడాది కర్ణాటకలోని ధార్వాడలో యూత్ నేషనల్ కబడ్డీ టోర్నీలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించా. మూడుసార్లు రాష్ట్రస్థాయి టోర్నీల్లో పాల్గొన్నా. సీనియర్ నేషనల్ ఆడాలన్నదే లక్ష్యం. అందుకోసం నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్నా. వేసవి శిబిరంలో మ్యాట్‌పై శిక్షణ చాలా బాగుంది.

– మహేష్, పెద్ద ఆదిరాల (బాలానగర్)

నాలుగేళ్లుగా కబడ్డీ ఆడుతున్నా..



నాలుగేళ్లుగా కబడ్డీ ఆడుతున్నా. ఇప్పటి వరకు మూడుసార్లు రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో పాల్గొన్నా. భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించాలన్నదే లక్ష్యం.

– షేక్ మోయిజ్, మహబూబ్‌నగర్

ప్రో-కబడ్డీ లీగ్‌లో ఆడుతా..



కబడ్డీ అంటే చాలా ఇష్టం. గతేడాది బీహార్‌లో జరిగిన సబ్‌జూనియర్ జాతీయస్థాయి కబడ్డీ టోర్నీలో తెలంగాణ నుంచి ఆడాను. ప్రో-కబడ్డీ లీగ్‌లో ఆడాలని ఉంది. భవిష్యత్‌లో ఇండియా తరపున అంతర్జాతీయ మ్యాచ్‌లలో పాల్గొనడమే లక్ష్యం. వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకుంటా.

– పాండునాయక్, తిమ్మాయిపల్లితండా (అడ్డాకుల)

క్రీడాకారులకు ప్రోత్సాహం..



కబడ్డీ క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తాం.. ఇలాంటి వేసవి శిబిరాలను యువత సద్వినియోగం చేసుకొని ప్రతిభ చాటాలి. జిల్లా కబడ్డీ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలి.

– బి.శాంతికుమార్, అధ్యక్షుడు, జిల్లా కబడ్డీ సంఘం, మహబూబ్‌నగర్

గట్టులో భారీ వర్షం

- ఆరగిద్దలో కూలిన గుడిసె




ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్నోనిపల్లె వాగు

గట్టు: వేసవి ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు వరుణదేవుడు కాస్త ఊరట నిచ్చారు. ఈ సారి ఎండలు అత్యధికంగా 46 డిగ్రీల వరకు నమోదు కావడంతో ఉక్కపోతతో జనాలు తల్లడిల్లిపోయారు. ఈక్రమంలో గట్టు మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జామున వరకు అత్యధికంగా 98.8 మి.మీటర్ల వర్షం కురిసింది. దీంతో మొన్నటి దాకా గట్టు చెరువులోకి చుక్క నీరు కూడా లేకుండా వట్టిపోయిన గట్టు చెరువులోకి వర్షపు నీరు వచ్చి చేరింది. గతంలో ఎన్నిడూ లేని విధంగా మండు వేసవి(మే)లో గట్టు చెరువు కాలువ ద్వారా నీరు పారడం రైతులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ వేసవిలో దాహంతో తల్లడిల్లిపోతున్న మూగ జీవాలకు వరుణ దేవుడు కాస్త ఊరట నిచ్చారు. మాచర్ల చెరువులోకి కూడా వర్షపు నీరు వచ్చి చేరింది. చిన్నోనిపల్లె వాగులు వానా కాలంలో పారిన విధంగా వర్షపు నీటితో పారుతున్నాయి. చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లోకి వర్షపు నీరు వచ్చి చేరుతున్న తరుణంలో నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షానికి ఆరగిద్ద గ్రామానికి చెందిన తిమ్మప్ప గుడిసె పాక్షికంగా కూలింది. వరి కోతలు పూర్తి చేసుకుని పొలాల్లో ధాన్యాన్ని నిల్వ చేసుకున్న రైతులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. మామిడి తోటల రైతులకు భారీ వర్షంతో కాయలు నేలరాలి ఇబ్బంది పడ్డారు.



మొన్నటి వరకు వేసవి ఎండలతో ఎండిపోయిన గట్టు చెరువు



నేడు భారీ వర్షంతో గట్టు చెరువులోకి చేరిన వర్షపు నీరు

చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లో పెరిగిన నీటిమట్టం



చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లోకి చేరిన వర్షపు నీరు

- ఆందోళనలో నిర్వాసిత కుటుంబాలు

గట్టు: చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరగడంతో నిర్వాసిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురువడంతో గ్రామం చుట్టు పక్కల వాగుల్లోంచి వరద నీరు పెద్దఎత్తున రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతుంది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా చిన్నోనిపల్లె వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులు సుమారుగా 16 ఏళ్ల పాటుగా పెండింగ్‌లో ఉండిపోయాయి. ముంపు గ్రామస్తులకు పునరావాసం కల్పించక పోవడంతో నిర్వాసిత కుటుంబాలు పాత ఊరిలోనే ఉండిపోయారు. గతేడాది రిజర్వాయర్ గండిని పెద్ద ఎత్తున పోలీస్ బలగాల మోహరింపుతో పూడ్చి వేశారు. అయితే నిర్వాసితులు ఆందోళన కొనసాగించడంతో రిజర్వాయర్‌లో నీరు నిల్వ ఉండకుండా వదిలేసిన గండిని సగం మాత్రమే పూడ్చి వదిలేశారు. ప్రస్తుతం చిన్నోనిపల్లె గ్రామానికి రెండు వైపులా ఉన్న వాగుల్లోని నీరంతా వర్షాల కారణంగా రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతుంది. నిర్వాసిత కుటుంబాలు ఇప్పటికి గ్రామాన్ని వదిలి పునరావాసంలోకి వెళ్లకుండా పాత గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. గతేడాది కొంత మేరకు నీరు నిల్వ ఉండగా, ప్రస్తుతం కురిసిన భారీ వర్షం కారణంగా రిజర్వాయర్‌లోకి వాగుల ద్వారా నీరు వచ్చి చేరుతున్న తరుణంలో నిర్వాసిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పుష్కరఘాట్లలో ఇనుపకంచెలు ఏర్పాటుచేయాలి



కృష్ణమ్మ విగ్రహం సమీపంలో ధ్వంసమైన ఇనుపకంచె



పుష్కరఘాట్ దగ్గర పూర్తిగా కొట్టుకుపోయిన ఇనుపకంచెలు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రం వద్ద కృష్ణానది పుష్కరఘాట్లలో భక్తుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప కంచెలు పూర్తిగా విరిగిపోయాయి. గతంలో కృష్ణానదికి అధికంగా వచ్చిన వరదల కారణంగా ఇనుప కంచెలు కొట్టుకుపోవడంతో పుష్కరఘాట్లు ప్రమాదభరితంగా మారాయి. బీచుపల్లి పుణ్యక్షేత్రానికి నిత్యం వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అదేవిధంగా ప్రతి అమావాస్యతో పాటు జాతర సమయంలో వేల సంఖ్యలో భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకునేందుకు వస్తుంటారు. పుష్కరఘాట్లలో భక్తుల రక్షణకోసం ఏర్పాటు చేసిన ఇనుపకంచెలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోతున్నారు. ఇనుప కంచెలు విరిగిపోయి ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు వాటిని ఏర్పాటు చేయకపోవడంతో నదిలో స్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులకు, పర్యాటకులకు రక్షణ కరువైందని భక్తులు విమర్శిస్తున్నారు. మే నెల చివరి వారంలో బీచుపల్లి బ్రహ్మోత్సవాలు ఉండటంతో నెల రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులకు ప్రమాదం పొంచి ఉందని తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పుష్కరఘాట్లలో ఇనుప కంచెలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆరుగురికి రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా

కల్వకుర్తి: పొలం పంచాయితీ కేసులో ఆరుగురికి జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లుగా పోలీసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని యంగంపల్లికి చెందిన లక్ష్మమ్మ అతని కుమారుడు వంశీకృష్ణ కలిసి 2020లో భూమి పంచాయితీ కేసు విషయమై కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన అప్పటి ఎస్ఐ-2 బాలస్వామి పలు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి అందుకు సంబంధించిన చార్జిషీట్‌ను కల్వకుర్తి కోర్టులో సమర్పించారు. పలువురిని విచారించిన అనంతరం కోర్టు పొలం పంచాయితీకి కారణమైన చిమ్ముల పర్వత్‌రెడ్డి, చిమ్ముల జంగారెడ్డి, చిమ్ముల వెంకట్‌రెడ్డి, పొలం సుల్తాన్, కుడుముల మాధవరెడ్డి, యడ్మ సందీప్‌రెడ్డిలకు రెండేళ్ల జైలుశిక్షతో పాటుగా, ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానాను కల్వకుర్తి అసిస్టెంట్ సెషన్ జడ్జి శ్రీదేవి విధించారు.

నకిలీ విత్తనాలు పట్టివేత

మక్తల్: మండలంలోని భూత్పూర్‌లో శుక్రవారం బోయ రాము ఇంట్లో 40.780 కిలోలు, బోయ అంజప్ప ఇంట్లో 16.880 కిలోల నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు ఏఎస్ఐ ఎల్లయ్య తెలిపారు. మండల వ్యవసాయ అధికారి మిథున్ చక్రవర్తి పంచనామా నిర్వహించిన అనంతరం విత్తనాలను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.



ప్రైవేట్ క్లినిక్‌లలో తనిఖీలు



భూత్పూర్ పట్టణంలో అమ్మ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు కొత్త మొల్గర, ఎల్కిచర్లలో ప్రైవేట్ క్లినికల్‌లను శుక్రవారం జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతిరావు తనిఖీలు చేపట్టారు. ఆర్ఎంపీలు ప్రైవేట్ క్లినిక్‌లలో ప్రథమ చికిత్సను అందిస్తూ రోగులకు సలహాలు, సూచనలతో పాటు పెద్ద ఆస్పత్రులకు వెళ్లేలా సూచించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్య పరీక్షలు చేస్తున్నట్లు, సెలైన్ ఎక్కించడం, బోర్డులపై డాక్టర్‌లుగా రాసినట్లు గుర్తించినట్లు తెలిపారు. మున్సిపాలిటీలోని అమ్మ క్లినిక్‌లో రోగులకు సెలైన్ ఎక్కించడంతో పాటు ఓ షటర్‌లో సెలైన్ ఎక్కించడానికి 4 బెడ్లు వేసినట్లు గుర్తించారు. అమ్మ క్లినిక్ నిర్వహిస్తున్న సంతోష్‌పై చర్యలు తీసుకోనున్నట్లు, రెండు క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఇద్దరు డాక్టర్లుగా బోర్డు రాసుకున్న వారికి నోటీసులు జారీ చేసినట్లు అధికారి తెలిపారు. సీహెచ్ఓ అయ్యుబ్‌ఖాన్, హెల్త్ అసిస్టెంట్ ప్రమోద్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

మూసుకున్న ప్రైవేట్ క్లినిక్‌లు

విషయం తెలుసుకున్న నిర్వాహకులు క్లినిక్‌లను మూసేసి వెళ్లారు. పట్టణంలో ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తున్న వారు వైద్యులుగా చెలామణి అవుతూ జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులకు రోగులను పంపిస్తూ వారి నుంచి కమీషన్ తీసుకుంటున్నారు.

ఆటోను తప్పించబోయి అదుపుతప్పిన బస్సు

- వెనుక నుంచి బస్సును ఢీకొట్టిన ఆటో



జాతీయ రహదారి పక్కకు పడిపోయిన బస్సు, వెనకాల బస్సును ఢీకొట్టిన ఆటో

ఉండవెల్లి: మండలంలోని ఉండవెల్లి శివారులో జాతీయ రహదారిపై ప్రైవేటు బస్సు అదుపు తప్పి రోడ్డు కిందికి దిగిపోయింది. అందులోని 35 మంది ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ ప్రైవేట్ బస్సు పాండిచేరి నుంచి హైదరాబాద్ వెళ్తుంది. శుక్రవారం తెల్లవారుజామున ఉదయం 4 గంటలకు ఉండవెల్లి శివారు హిందుస్తాన్ హోటల్ పక్కకు రాగానే, జొన్నలతో వెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి.. బస్సు రోడ్డు కిందకు దిగిపోయింది. దాని వెనుక ఉన్న ఆటో బస్సును ఢీకొట్టింది. బస్సులోని 35 మంది ప్రయాణికులందరూ సురక్షితంగా ప్రమాదంటంచుల నుంచి బయటపడ్డారు. బస్సు డ్రైవర్ ఇమానుయల్, గురు సురక్షితంగానే ఉన్నారని తెలిపారు. ఆటోలోని ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. బస్సును నేషనల్ హైవే సిబ్బంది క్రేన్ల సహకారంతో సరిచేశారు. అప్పటి వరకు బస్సు వెనుకాల ఉన్న వాహనాలు నిలిచిపోయాయి. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఎలాంటి ప్రమాదం కాకపోవడంతో కేసు నమోదు చేయలేదని తెలియజేశారు.

పంట వ్యర్థం.. నేలకు సారం



కడంపల్లి శివారులో పంట వ్యర్థాలను కాల్చిన రైతులు

- కాలిస్తే పర్యావరణ కాలుష్యం
- వరి కోత వ్యర్థాలను తగలబెడుతున్న రైతులు

కోస్గి: వరి పొలాల్లో కోతల అనంతరం పంట వ్యర్థాల కాల్చివేతతో కాలుష్యం తీవ్ర స్థాయిలో పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వ్యర్థాలకు నిప్పంటించడంతో పంటలకు మేలు చేసే కీటకాలు, ఇతర సూక్ష్మ జీవులు నశిస్తాయని, రైతులు పంట అవశేషాలను భూమిలో కలియ దున్నితేనే సారం పెరిగి మరింత ప్రయోజనకరంగా ఉంటుందంటున్నారు.

దున్నితేనే భూమికి మేలు..

సాధారణంగా పంట కోతల అనంతరం పంట వ్యర్థాలు పొలాల్లో మిగులుతాయి. వరికోత అనంతరం గడ్డి, ఇతర పంటల్లో అడుగున ఉండే మొక్కల భాగాలు పొలంలోనే ఉంటాయి. వాటిని కాల్చకుండ భూమిలో కలియదున్నడం వల్ల భూసారం మరింత పెరుగుతుంది. దీంతో రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చు. ఓ పరిశోధనలో పంజాబ్, హరియాణా వంటి రాష్ట్రాల్లో రైతులు పంట అవశేషాలను కాల్చివేయడంతోనే దేశ రాజధాని ఢిల్లీలో పొగమంచుతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారని నిర్ధారించారు. రైతులు పొలాల్లో పంటల వ్యర్థాలను, ఇతర వస్తువులను విచక్షణరహితంగా కాలుస్తుండటంతో వాతావరణంలోకి కార్బన్ డై ఆక్సైడ్, మిథేన్, కార్బన్ మోనాక్సైడ్ వంటి విష వాయువులు విడుదలవుతున్నాయి.

దిగుబడులు పెరుగుతాయి



పొలాల్లో పంట వ్యర్థాలను భూమిలో కలియదున్నితే సారం పెరగడంతోపాటు దిగుబడి సైతం పెరుగుతుంది. పంట పొలాల్లో పంట వ్యర్థాలు భూమిలో కలియడానికి సూపర్ పాస్పెట్ చల్లాలి. వ్యర్థాలను కాల్చివేయడం ద్వారా పొలాలకు నష్టంతోపాటు సారం తగ్గి దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. రైతులు పంట వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్చివేయకూడదు.

– రామకృష్ణ, ఏఓ, కోస్గి

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- Prakruthi Entrepreneurs Pvt Ltd Village Mart Managers & Mandal Dealers, Salary 56000/- Best opportunity Contact: 9963560410
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో హోమ్ లోన్స్‌లో పనిచేయడానికి మార్కెటింగ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ స్త్రీ/పురుషులు కావలెను. జీతం:10,000/- నుండి 20,000/- వరకు. 7386855009, 9642725208.
- We Required qualified and experienced teachers in our school at Bhoothpur to teach Nursery to VII E/M Interested Candidates attend interview on 19 & 20th May 2024 (Sunday, Monday) with Resume & Originals between 11AM to 2PM at school premises Cell: 9010775522, 9010581841
- త్రివేణి హోమ్స్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K ఫోన్: 9160900024/9840400073

సాక్షి భవిత విద్యార్థుల కోసం

సాక్షి ద్వారా మీ ఆత్మీయుల పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే HAPPY BIRTHDAY

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విచక్షణతో పరిశీలించి తదుపరి ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ... – సాక్షి మేనేజర్

మంత్రి ఉత్తమ్ రాజీనామా చేయాలి

ఈ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది: బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రకరకాలుగా మోసం చేస్తోందని, ధాన్యం కొనుగోలు చేయకుండా గోస పెడుతోందని మండి పడ్డారు. రైతులు ధాన్యాన్ని కల్లాల్లో పోసుకుని ఎదురు చూస్తున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సమయానికి ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. శుక్రవారం బీజేపీ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, రామారావు పటేల్, డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబులతో కలసి మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా స్పందించడం లేదన్నారు. ఆయనకు వ్యవసాయంపై అవగాహన లేదని.. ఇదంతా చూస్తుంటే. రైస్ మిల్లర్లతో ప్రభుత్వానికి లావాదేవీలు ఉన్నాయా? అన్న అనుమానం కలుగుతోందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లంచాలు తీసుకుంటున్నారని, త్వరలోనే ఆధారాలు బయట పెడతామని చెప్పారు. ఐదెకరాల వరకే రైతు భరోసా అని చెప్పడం కూడా మోసం చేయడం కాదా? అని ప్రశ్నించారు.

కిషన్‌రెడ్డిది ఓట్ల ఆరాటమే!

టీపీసీసీ కిసాన్ సెల్ నేతలు కోదండరెడ్డి, అన్వేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని టీపీసీసీ కిసాన్ సెల్ ధ్వజమెత్తింది. ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, టీపీసీసీ కిసాన్ సెల్ అధ్యక్షుడు ఎస్.అన్వేశ్‌రెడ్డి శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కరువు ఏర్పడిందని, భూగర్భజలాలు అడుగంటిపోయి రైతు కూలీలకు ఉపాధి కరువైన పరిస్థితులు నెలకొన్నా కిషన్‌రెడ్డి కనీసం సమీక్ష నిర్వహించలేదని విమర్శించారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తు కారణంగా 97మంది చనిపోతే వారిని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభు త్వం కేంద్రాన్ని కోరిందని, అయినా కిషన్‌రెడ్డి మాత్రం కనీసం ప్రధానికి ఒక్క లేఖ కూడా రాయలేదని దుయ్యబట్టారు. ఆయన ఆరాట మంతా ఓట్ల కోసం మాత్రమేనని, ప్రజల కోసం కాదని విమర్శించారు. బీఆర్‌ఎస్ నేత లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్ నాం చేసే పనిలో పడ్డారని కోదండరెడ్డి, అన్వేశ్ రెడ్డిలు విమర్శించారు.



భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండలం పోలారంలో నేలవాలిన వరి



ఆసిఫాబాద్ జిల్లా ఎల్లూర్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా కాలువ తీస్తున్న రైతు

ధాన్యం.. దయనీయం

అన్నదాతను దెబ్బతీసిన అకాల వర్షాలు.. తడిసిపోయిన కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం

కొన్నిచోట్ల ధాన్యం రాశులు కొట్టుకుపోయిన వైనం

ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు అతలాకుతలం అవుతున్నారు. గత రెండురోజులుగా పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా గురు, శుక్రవారాల్లో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో కోత దశలో ఉన్న వరి పంట నేలవాలింది. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఉన్న ధాన్యం రాశులు తడిచిపోయాయి. భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి జిల్లాల్లోని పలు మండలాల్లో.. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం రాశులు తడిచిపోయాయి. ఇంతకుముందు వర్షానికి తడవడంతో ఆరబోసుకున్న వడ్లు వర్షపు నీటికి కొట్టుకుపోయాయని రైతులు వాపోయారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో మార్కెట్ యార్డు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిచిపోయింది. మహబూబాబాద్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కూడా వర్షం కారణంగా రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి కరీంనగర్‌లోని పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో శుక్రవారం సుమారు గంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. పలు మండలాల్లో క్వింటాళ్ల కొద్దీ వడ్లు తడిచిపోయాయి. ఖమ్మం, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలకు మామిడి కాయలు రాలిపోయాయి. ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేయాలని, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.



భువనగిరి జిల్లా రహీంఖాన్‌పేట కొనుగోలు కేంద్రంలో కాంటా వేసిన ధాన్యం బస్తాలు తడిసిపోయిన దృశ్యం

రైతులను పట్టించుకోకుండా విహారయాత్రలా?

బీజేపీ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీశ్‌బాబు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియగానే రాష్ట్ర మంత్రులు విహార యాత్రలకు వెళుతున్నారే కానీ రైతుల సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీశ్‌బాబు మండిపడ్డారు. ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు తెరిచి నెల రోజులు గడిచిన 25శాతం మాత్రమే కొనుగోలు చేశారని, దీనిపై గత 15 రోజులుగా అధికారులకు ఫోన్ చేస్తే ఎన్నికల తర్వాత అని చెప్పారన్నారు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న సమీక్షల వల్ల ఏ మాత్రం ఉపయోగం ఉండటం లేదన్నారు. వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష చేస్తే ఆ శాఖ మంత్రే వెళ్లలేదన్నారు.

ఎప్పుడు పడితే అప్పుడు రావడానికి మాకు భార్యాపిల్లలు లేరా?

కల్లాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని రవాణా చేయాలంటూ వారం రోజులుగా రైతుల ఆందోళన

తమ ఆందోళన గురించి వివరించడానికి వెళ్తే తహసీల్దార్ నిర్లక్ష్యపు వ్యాఖ్యలు.. రాస్తారోకోకు దిగిన రైతులు



పోలీసులతో రైతుల వాగ్వాదం

పాపన్నపేట (మెదక్): ధాన్యం రవాణా చేయాలని కోరుతూ వారం రోజుల నుంచి రైతులు ఆందోళన చేస్తున్నా అధికారుల నుంచి స్పందన కరువైంది. వారి ఆందోళనను పట్టించుకోకపోగా ఓ తహసీల్దార్ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. మెదక్ జిల్లా పాపన్న పేట సమీపంలో మిన్‌పూర్‌లో శుక్రవారం జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో వారం రోజులుగా రవాణా జరగక వందలాది క్వింటాళ్ల ధాన్యం కల్లాల్లో పేరుకుపోయింది. అయితే గురువారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసి మొలకలెత్తాయి. దీంతో ధాన్యం రవాణా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు పాపన్నపేట తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుకు రైతుల ఆందోళన గురించి వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ 'ఎప్పు డంటే అప్పుడు వచ్చేయడానికి మాకు మాత్రం భార్యా పిల్లలు లేరా' అంటూ నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో ఆగ్రహించిన రైతులు బొడ్మట్‌పల్లి రోడ్డుపై రాస్తారోకో చేశారు. దీంతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్సై సురేశ్ అక్కడకు చేరుకుని రైతులకు నచ్చ జెప్పినప్పటికీ ఆందోళన విరమించలేదు. పోలీ సులు ఫోన్ చేసి తహసీ ల్దార్‌ను ఘటనా స్థలానికి పిలిపించారు. రైతులతో తహసీల్దార్ కొద్దిసేపు మాట్లాడి వారికి క్షమాపణ చెప్పారు. అదేవిధంగా గంటలో ధాన్యం రవాణా ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



రైతులకు క్షమాపణ చెబుతున్న తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు

ప్రకృతి సేద్యంతోనే పౌష్టికాహార భద్రత

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన 8 రాష్ట్రాల శాస్త్రవేత్తలు



శాస్త్రవేత్తలకు ప్రకృతి సాగు విశేషాలను వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ నిపుణుడు జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి వ్యవసాయ విస్తరణ ద్వారానే భవిష్యత్తులో దేశ ప్రజలకు సంపూర్ణ పౌష్టిక విలువలు కలిగిన ఆహార భద్రత, రైతులకు ఆదాయ భద్రత చేకూరు తుందని ప్రకృతి వ్యవసాయ దారుడు, న్యూఢిల్లీలోని భారతీయ వ్యవసాయ పరిశో ధనా సంస్థ (ఐఏఆర్ఐ) నుంచి నేష నల్ ఇన్నోవేటివ్ ఫార్మర్ పురస్కార గ్రహీత వై.జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం గట్టుపల్లిలోని 60ఎకరాల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం 8 రాష్ట్రాలకు చెందిన కృషి విజ్ఞాన కేంద్రాలలో పనిచేస్తున్న 54 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు సందర్శించారు. రాజేంద్రనగర్‌లోని భారతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ (మేనేజ్)లో ఈ శాస్త్రవేత్తలు ప్రకృతి వ్యవసాయ విస్తరణపై 5 రోజుల శిక్షణ పొందుతూ క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ పద్ధ తుల్లో ఈ క్షేత్రంలో ఘనజీవామృతం, జీవామృతం, కషాయాలతో అనేక రకాల పండ్ల తోటలతోపాటు వరి, కూరగాయలు సాగు చేస్తున్నామని జగదీశ్‌రెడ్డి శాస్త్ర వేత్తలకు వివరించారు. కొర్ర మీను చేపలు, నాటు కోళ్లు, ఆవుల పెంపకం ద్వారా బహుముఖ ఆదాయం పొందటం ద్వారా రైతులు ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. శాస్త్రవేత్తల బృందానికి మేనేజ్ శాస్త్రవేత్త, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ సంతోష్ నేతృత్వం వహించారు. మేనేజ్ ద్వారా 425 కేవీకేల శాస్త్రవేత్తలకు ప్రకృతి వ్యవసాయ శిక్షణ ఇస్తున్నామని, ఇప్పటికి పది బ్యాచ్‌లకు శిక్షణ పూర్తిచేశామని సంతోశ్ తెలిపారు.

రామన్‌పాడులో 1,010 అడుగులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం రోజురోజుకు తగ్గుతోంది. శుక్రవారం 1,010 అడుగులకు చేరిందని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా నీటి సరఫరా లేదని.. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని వివరించారు.

నాగర్‌కర్నూల్‌లో పద్మావతి కళాశాలకు రూ.లక్ష జరిమానా

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని పద్మావతి జూనియర్ కళాశాలకు ఇంటర్ బోర్డు రూ.లక్ష జరిమానా విధించడంతో పాటు, రెండేళ్లు కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహించకుండా అనుమతులు రద్దు చేశారు. యాజమాన్యం అడ్డగోలు ఫీజులు వసూలు చేయడం, ప్రాక్టికల్స్ సమయంలో డబ్బులు వసూలు చేయడం, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం వంటి రాతపూర్వక ఫిర్యాదులు రావడంతో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ ఇంటర్ బోర్డుకు నివేదిక అందజేశారు. దీంతో బోర్డు కళాశాలకు జరిమానా విధించడంతో పాటు, ప్రాక్టికల్స్ నిర్వహణను రెండేళ్లు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

మహిళకు రోబోటిక్ సర్జరీ

పాలమూరు: రోబోటిక్ సర్జరీ ద్వారా ఓ మహిళ గర్భాశయంలోని పెద్ద గడ్డను ఎలాంటి నొప్పి లేకుండా తొలగించి, ఒకే రోజులో ఇంటికి పంపించామని మలక్‌పేట్ యశోద ఆస్పత్రి సీనియర్ ల్యాప్రొస్కోపిక్ సర్జర్ డాక్టర్ టి.సురేందర్‌రెడ్డి వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని హిమాలయ హోటల్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రానికి చెందిన 42 ఏళ్ల మహిళ తీవ్ర నొప్పితో ఆస్పత్రికి వచ్చిందని చెప్పారు. అవసరమైన పరీక్షలు చేసి, గర్భాశయంలో పెద్దగడ్డ కారణంగా తీవ్ర రక్తస్రావం జరుగుతుందని గుర్తించినట్లు చెప్పారు. దీంతో పాటు గాలిబ్లడర్‌లో కూడా అధికంగా రాళ్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆమెకు క్వాడ్రెంట్ రోబోటిక్ సర్జరీ చేశామని చెప్పారు. భరించలేని నొప్పిని దూరం చేయాల్సిన సందర్భాల్లో రోబోటిక్ సర్జరీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తక్కువ ఖర్చుతో అత్యాధునిక శస్త్రచికిత్స అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అడ్వాన్స్ డామిన్స్ రోబోటిక్ సర్జరీ కోసం యూఎస్ఏలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నట్లు వెల్లడించారు. ఇకపై ల్యాప్రొస్కోపిలో చేసే ప్రతి సర్జరీ కూడా రోబోటిక్ విధానం ద్వారా చేయవచ్చని వివరించారు. సమావేశంలో మార్కెటింగ్ హెచ్ఓడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నెన్నో అందాలు.. వెళ్దామంటే దారులు లేవు



రామన్‌పాడు ప్రాజెక్టుకు వెళ్లే దారి



రామన్‌పాడు ప్రాజెక్టు

• సౌకర్యాలు లేక మరుగునపడుతున్న రామన్‌పాడు జలాశయం

మదనాపురం: వనపర్తి జిల్లాలో రామన్‌పాడు జలాశయం వద్ద ఎన్నెన్నో అందాలు ఉన్నప్పటికి పట్టించుకునే వారు లేక మరుగున పడుతుంది. ప్రకృతి రమణీయ దృశ్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, పక్షులు కిలకిల అరుపులు, ఊకచెట్టు వాగు లాంటి చూడదగ్గ ప్రదేశాలు ఉన్నాయి. ఊకచెట్టు వాగు పొంగి పొరిలినప్పుడల్లా ప్రాజెక్టు గేట్లును ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడుదల చేస్తారు. ఈ దృశ్యాలను తిలకించేందుకు ప్రాజెక్టును చూడడానికి ప్రజలు తరలివస్తారు. సరైన రహదారులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటనలు చాలా ఉన్నాయి. ఏడాది పొడవునా పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడే ప్రాజెక్టును పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఈ ప్రాంతా ప్రజలు చెబుతున్నారు.

గుంతలమయమైన రోడ్డు..

రామన్‌పాడు ప్రాజెక్టుకు వెళ్లాలంటే రోడ్డుమార్గం నరకాన్ని తలపిస్తుంది. గత వర్షాకాలంలో ఊకచెట్టు వాగుకు వరద పోటెత్తడంతో ఆత్మకూర్, అమరచింత మండలాలకు వాహనాలపై వెళ్లడానికి ఎంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుంతలమయమై బురద నిండి ఉండడంతో వాహనాలు దెబ్బతింటున్నాయి. ఈ మధ్యకాలంలో ప్రాజెక్టు వరకు రోడ్ల మరమ్మతు రూ.10 లక్షలు వెచ్చించి చేపట్టిన ఫలితం లేకపోయింది. అక్కడక్కడ కంప చెట్లు తొలగించి వదిలేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకే తాగు, సాగునీరు అందించే జలాశయం అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సాయంత్రం వేళల్లో పక్షుల రాగాలు

ప్రాజెక్టు పక్కన ఉన్న నెమళ్ల గట్టు వద్ద పలు రకాల పక్షులు ఉన్నాయి. సాయంత్రం వేళలో వాటి అరుపులు వింటే ఎంతో మధురానుభూతి కలుగుతుంది. పక్షుల కిలకిల రాగాలతో అ ప్రాంతం గంటన్నర పాటు మార్మోగుతుంది. ఎన్నడూ వినపడని పక్షుల అరుపులు అక్కడ వినిపిస్తాయి.

ప్రాజెక్టుపై వెలగని లైట్లు

ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆనకట్ట గుండా 60 లైట్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో లైట్లు వెలిగించేందుకు భద్రత కోసం సిబ్బందిని నియమించారు. కానీ ఈ మధ్యకాలంలో రాత్రి వేళలో లైట్లు వేయడం లేదని ప్రాజెక్టు చిమ్మచీకట్లో కనిపిస్తుందని పరిసర గ్రామాల ప్రజల అంటున్నారు. అజ్జకొల్లు, రామన్ పాడు గ్రామాల ప్రజలు ఆత్మకూరు వెళ్లాలంటే చిమ్మ చీకటిలో ప్రాజెక్టు మీద ప్రయాణం చేయాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రాజెక్టు అధికారులు పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని తెలుపుతున్నారు.

దేవుడి భూమిని క్రీడా మైదానంగా మార్చే యత్నం

• సీసీ బెడ్‌ను తొలగించిన ఈఓ పురేందర్‌కుమార్



భూమిలో జేసీబీతో సీసీ బెడ్ తొలగిస్తున్న ఆలయ సిబ్బంది

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి విలువైన భూములను క్రీడా మైదానంగా మార్చే కుట్రను ఈఓ పురేందర్‌కుమార్ అడ్డుకున్నారు. వివరాలిలా.. ఏపీలోని కర్నూలు జిల్లా కల్లూరు మండలం సర్వే నం.346/1, 346/3లో 15.35 ఎకరాలు ఉండగా.. దేవస్థానం వారు వ్యవసాయం నిమిత్తం లీజుకు ఇచ్చారు. కర్నూలు జిల్లాకు చిట్టచివర ఊళ్లాలకు వెళ్లే దారిలో ఉండటంతో కొంత మంది క్రీడాకారులు టోర్నమెంట్ కోసం ఈ భూమిపై కన్నేశారు. ఈ మేరకు క్రికెట్ గ్రౌండ్‌గా మార్చేందుకు మూడు రోజుల క్రితం 8 అడుగుల వెడల్పు 22 అడుగుల పొడవుతో సిమెంట్ బెడ్ వేశారు. దీంతో ఈ భూమిని కౌలుకు తీసుకున్న వ్యక్తి ఆలయం వారికి సమాచారం ఇవ్వడంతో ఈఓ పురేందర్‌కుమార్ శుక్రవారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. వెంటనే జేసీబీతో ఆలయ భూమిలో వేసిన సీసీ బెడ్‌ను తొలగించారు. అయితే కొంతమంది క్రీడాకారులు దీనిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా పూర్తిగా తొలగించి వేయించారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్ క్రైం: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర 24 గంటలూ మూడు అంచెల భద్రత నిఘా పెట్టాలని, సీసీ కెమెరాల పనితీరు సక్రమంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్ సిబ్బందికి సూచించారు. జిల్లాకేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ పరీక్షల విభాగంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌లను శుక్రవారం ఎస్పీతో పాటు పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించి భద్రతను తనిఖీ చేశారు. యూనివర్సిటీ సమీప పరిధిలో అనుమతి లేని వ్యక్తులు ఎవరూ రాకుండా చూడాలని, ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. ప్రతి గదిలో సీసీ కెమెరాల పనితీరు సక్రమంగా ఉండే విధంగా సదరు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో అదనపు ఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వారోత్సవ పూజలు



పల్లకీసేవలో భక్తులు, అర్చకులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రాతః కాలాన అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం.. 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యాగశాలలో సామూహిక చండీహోమాలు చేశారు. చండీహోమాల్లో వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. అలాగే ప్రదోశ కాలంలో అమ్మవారి ఆలయం చుట్టూ పల్లకీ సేవ, దర్బార్ సేవలు, దశవిధ హారతులిచ్చారు. చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ గొడుగుల సాయంతో పల్లకీసేవ కొనసాగించారు.

ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ సీట్లు గెలుస్తాం



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుస్తారని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఓటింగ్ అనంతరం మూడు రోజులపాటు సుదీర్ఘంగా చర్చించామని, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తారని చెప్పారు. దేశంలో బీజేపీ తుడుచుపెట్టుకుపోతుందని, ఇండియా కూటమి 300 సీట్లతో అధికారంలోకి వచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజలు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారని, జూన్ 9న రాహుల్‌గాంధీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. పదేళ్లపాటు అధికారంలోకి ఉన్న బీజేపీ తప్పుడు ప్రచారాలతో రెచ్చగొట్టిందని, ప్రజలు ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పారని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 13 సీట్లు విజయం సాధిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఏకమై రేవంత్‌రెడ్డిని దెబ్బతీయడానికి చూశాయని, కానీ ప్రజలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓట్లు వేసినట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ముందు రాత్రి వరకు తమ పార్టీకి ప్రచారం చేసుకొని ఓటింగ్ రోజు బీజేపీకి ఓట్లు వేయాలని కోరారని ఆరోపించారు. పాలమూరులో అభివృద్ధిని అడ్డుకోవడానికి బీఆర్‌ఎస్ వ్యవహరించిన తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని, బీఆర్‌ఎస్‌కు ఇక మనుగడ లేదన్నారు. ఓటింగ్‌లో పాల్గొన్న ప్రజలందరికీ, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ, రాములుయాదవ్, కొండా జగదీశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.